

ఒంటెపై ఊరేగింపుగా..



ర్యాలీగా వెళ్తున్న దృశ్యం



ఉత్సవాలను తిలకిస్తున్న మంత్రులు అనిత, శ్రీనివాస్, ఎంపీ కలిశెట్టి, ఎమ్మెల్యేలు అదితి, పల్లా శ్రీనివాస్, కలెక్టర్ తదితరులు

ఉత్సవ శోభ

- ఘనంగా విజయనగర ఉత్సవాలు
- ప్రారంభించిన మంత్రులు అనిత, శ్రీనివాస్
- ఆకట్టుకున్న సాంస్కృతిక ప్రదర్శనలు
- నగరంలో సందడే సందడి

విజయనగరం, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): విజయనగర ఉత్సవాలు ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉత్సవ ర్యాలీని మంత్రులు వంగలపూడి అనిత, కొండపల్లి శ్రీనివాస్ జెండా ఊపి ప్రారంభించారు. పైడిమాంబ ఆలయం నుంచి మూడులాంతర్ల మీదుగా కోట వరకు ర్యాలీ సాగింది. అక్కడ ఏర్పాటు చేసిన ప్రదర్శనలను మంత్రులు, ఎమ్మెల్యేలు, జిల్లా అధికారులు ఆసక్తిగా తిలకించారు. పైడిమాంబ అమ్మవారి (మిగతా 6వ పేజీలో)



గాయని మధుప్రియ



తప్పెటగుళ్ల ప్రదర్శన



చిన్నారుల నృత్య ప్రదర్శన



గిరిజనుల థింసా నృత్య ప్రదర్శన



ఆకట్టుకున్న వేషధారణలు





చిన్నారి స్కేటింగ్..

అలరించిన మ్యూజికల్ నైట్

విజయనగరం టౌన్, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): నగరంలోని అయోధ్య మైదానంలో ఆదివారం రాత్రి నిర్వహించిన మ్యూజికల్ నైట్ కార్యక్రమం అలరించింది. గాయకులు మధుప్రియ, జానకిరాం సినీ, జానపద గీతాలు ఆలపించారు. గోదారి గట్టుమీద రామ చిలుకే, వొచ్చిండే మెల్లా మెల్లగా వొచ్చిండే.. వంటి పాటలతో ప్రేక్షకులను ఉర్రూతలూగించారు. మ్యూజికల్ నైట్ కార్యక్రమం నిర్వహణకు ఆర్థికంగా సహకరించిన పలువురు దాతలను మంత్రి శ్రీనివాస్, ఎమ్మెల్యే అదితి సత్కరించారు.



మ్యూజికల్ నైట్‌కు హాజరైన ప్రేక్షకులు

నేడే తొలేళ్ల సంబరం

- ఏర్పాట్లు పూర్తి చేసిన యంత్రాంగం
- పైడిమాంబకు పట్టు వస్త్రాలు సమర్పించనున్న గోవా గవర్నర్ అశోక్ గజపతిరాజు
- 2,600 మంది పోలీసులతో బందోబస్తు



బారికేడ్లు ఏర్పాటు చేసిన దృశ్యం

విజయనగరంరూరల్/కల్చరల్, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్రుల ఆరాధ్యదైవం, భక్తుల కొంగుబంగారం పైడిమాంబ అమ్మవారి తొలేళ్ల సంబరం సోమవారం జరగనుంది. సిరిమానోత్సవానికి ముందు జరిగే ఈ తొలేళ్ల ఉత్సవం కోసం దేవదాయ శాఖ, జిల్లా యంత్రాంగం అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాయి. ఆలయ అనువంశిక ధర్మకర్త, గోవా రాష్ట్ర గవర్నర్ అశోక్ గజపతిరాజు కుటుంబ సభ్యులు అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించి దర్శించుకోనున్నారు. తొలేళ్ల ఉత్సవానికి ఎంతో ప్రాముఖ్యత ఉంది. ఈ ఉత్సవం జరిగే రోజు రాత్రి చదురుగుడి వద్ద ఉన్న అమ్మవారి ఆలయం నుంచి పూజారి బంటుపల్లి వెంకటరావు ఘటాలతో ఊరేగింపుగా కోటకు వెళ్తారు. కోటముఖద్వారం



వద్ద ఉన్న కోట శక్తి అమ్మవారిని పూజిస్తారు. అనంతరం చదురుగుడి వద్ద రైతులకు విత్తనాలు అందిస్తారు. ఈ విత్తనాలు జల్లితే పంటలు బాగా పండుతాయని రైతుల నమ్మకం. సోమవారం రాత్రి అమ్మవారి వనం గుడి, చదురుగుడి ప్రాంతాల్లో పలు అధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. పలువురు ప్రముఖులు పైడిమాంబను దర్శించుకోనున్నారు. తొలేళ్ల, సిరిమాను సంబరం ముగిసే వరకూ (మిగతా 6వ పేజీలో..)

సిరిమాను రథాలు సిద్ధం



రథాలకు రంగులు వేస్తున్న దృశ్యం

విజయనగరం కల్చరల్, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): పైడిమాంబ జాతరలో ప్రధాన ఘట్టమైన మంగళవారం జరిగే సిరిమానోత్సవం కోసం రథాలు సిద్ధమయ్యాయి. సిరిమాను తిప్పే రథాలు, అంజలి, జాలరి రథాలకు సంబంధించిన చక్రాలను అధికారులు అమర్చారు. ఆలయ పూజారి బంటుపల్లి బైరాగినాయుడు నివాసం హుకుంపేటలో ఆదివారం సిరిమాను, రథాలకు పసుపు, కుంకుమలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. వివిధ ప్రాంతాలకు చెందిన భక్తులు సిరిమాను తయారుచేసిన ప్రాంతంలోనే మొక్కులు తీర్చుకుంటున్నారు. ఆ ప్రాంతంలో పోలీసు, అటవీశాఖ సిబ్బంది బందోబస్తు నిర్వహిస్తున్నారు. సోమవారం ఉదయం 10 గంటల్లోపే హుకుంపేటలో సిరిమానుకు పూజలు నిర్వహించి, అనంతరం అక్కడినుంచి చదురుగుడి వద్దకు తరలించనున్నారు. ఈ మేరకు అధికారులు, రూట్‌మ్యాప్ కూడా సిద్ధం చేశారు.

50వేల లడ్డూలు ..

తొలేళ్ల, సిరిమానోత్సవం కోసం వచ్చే భక్తుల కోసం అధికారులు ప్రసాదాలను సిద్ధం చేశారు. సోమ, మంగళవారం ప్రసాదాల పంపిణీకి ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేశారు. 50వేలకు పైగా లడ్డూలు, 30వేలకు పైగా పులిహోర ప్యాకెట్లను సిద్ధం చేసినట్లు అధికారులు తెలిపారు. 80 గ్రాముల లడ్డూ రూ.15, వంద గ్రాముల పులిహోర ప్యాకెట్ రూ.10కి విక్రయించనున్నారు. భక్తులందరికీ ప్రసాదం అందేలా చూస్తామని అధికారులు పేర్కొన్నారు.



లడ్డూ ప్రసాదం తయారు చేస్తున్న శ్రీవారి సేవకులు

ఆకట్టుకున్న పెట్ షో



ప్రదర్శనలో పాల్గొన్న కుక్కలు

విజయనగరం రింగురోడ్డు, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): విజయనగరం ఉత్సవాల్లో భాగంగా పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో ఆదివారం ఆయోధ్య మైదానంలో నిర్వహించిన పెట్ షో ఆహుతులను ఎంతగానో ఆకట్టుకుంది. పుంగనూరు జాతి ఆవులు, వివిధ జాతులకు చెందిన 300కి పైగా శునకాలు, పర్షన్ పిల్లులు, రంగు, రంగుల మకావ్, లవ్ బర్డ్స్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. గెలుపొందిన యజమానులకు ఎమ్మెల్యే అదితి బహుమతులు అందజేశారు. ఈ షోకి జంతు, పక్షు ప్రేమికులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. పశు సంవర్ధకశాఖ జాయింట్ డైరక్టర్ మురళి కృష్ణ, డీడీ జి.మహాలక్ష్మి, ఏడీలు పాల్గొన్నారు.

అబ్బురపరిచిన ఫల, పుష్ప ప్రదర్శన





పూలతో రూపొందించిన విజయనగరం గంటస్తంభం, కూరగాయలతో వినాయకుని ఆకృతి

విజయనగరం కలెక్టరేట్, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): విజయనగరం ఉత్సవాల్లో భాగంగా స్థానిక మాన్సాస్ గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన ఫల,పుష్ప ప్రదర్శన అబ్బురపరిచింది. ఈ ప్రదర్శనను కలెక్టర్ ఎస్.రామసుందర్ రెడ్డి, జేసీ సేతుమాధవన్ ప్రారంభించారు. వివిధ రకాల కూరగాయలు, ఫలాలు, పుష్పాలతో విభిన్న ఆకృతులతో ఏర్పాటు చేసిన జంతువుల బొమ్మలు ఆకట్టుకున్నాయి. ప్రధానంగా కూరగాయలతో రూపొందించిన వినాయకుని ఆకృతి కనువిందు చేసింది. విద్యార్థులు, మహిళలు అధిక సంఖ్యలో తిలకించారు.

ఇష్టారాజ్యంగా దర్శనానికి అనుమతులు 5లో

నేడు గ్రీవెన్స్ రద్దు 5లో

చర్చనీయాంశమైన డీసీసీబీ వేదిక 5లో

విపత్తుల సమాచారం తెలుసుకునేదెలా?

- నిరుపయోగంగా పరికరాలు
- వినియోగంలోకి తేవాలని ప్రజల విన్నపం

భోగాపురం, అక్టోబరు5 (ఆంధ్రజ్యోతి): విపత్తుల సమాచారాన్ని ముందస్తుగా తెలుసుకునేందుకు ప్రభుత్వం అందించిన పరికరాలు నిరుపయోగంగా పడి ఉన్నాయి. లక్షల రూపాయల విలువైన ఆ పరికరాలను ఓ మూలను పడేయడంతో దుమ్ము పట్టి వృథాగా మారాయి. జిల్లాలో బంగాళాఖాతం తీర ప్రాంతం సుమారు 29 కిలో మీటర్లు ఉంది. తీరం వెంబడి భోగాపురం, పూసపాటిరేగ (మిగతా 6వ పేజీలో..)



మూలకు చేరిన పరికరాలు

ఆటో డ్రైవర్ల ఆనందం

- వారి ఖాతాల్లో రూ.15వేలు జమ చేసిన ప్రభుత్వం
- వాహన నిర్వహణ కోసం ఉపయోగిస్తామని వెల్లడి

బీమాకు ఉపయోగిస్తా



కూటమి ప్రభుత్వం రూ. 15 వేలు ఆర్థిక సాయం అందించడం చాలా సంతోషంగా ఉంది. ఈ డబ్బుతో ఆటోకి బీమా, టైర్లు, తదితర వాహన నిర్వహణ పనులకు ఉపయోగిస్తాను. ఎన్నికల హామీలో లేనప్పటికీ మమ్మల్ని ఆదుకోవడం ఆనందాన్నిచ్చింది.

-కింతలి శివ, పక్కిగ్రామం, బొబ్బిలి

సరైన సమయంలో నగదు జమ



మహిళలకు ఉచిత ఆర్టీసీ బస్సు పథకంతో నా ఆటోకు గిరాకీ తగ్గింది. దీంతో ఆదాయం లేక ఇబ్బందులు పడుతున్నా. ఆటోకు ఇన్సూరెన్స్ ఫిట్‌నెస్ చేయించుకోవలిసి ఉంది. వీటికోసం అప్పు చేద్దామనుకున్నా. సరైన సమయంలో ప్రభుత్వం రూ.15వేలు జమ చేయడం సంతోషంగా ఉంది.

-బోనెల ప్రభుదేవా, ఆటో డ్రైవర్, భోగాపురం



విజయనగరం నియోజకవర్గ ఆటో డ్రైవర్లకు చెక్కును అందిస్తున్న హోంమంత్రి అనిత(ఫైల్)

భోగాపురం/లక్కవరపుకోట/బొబ్బిలిరూరల్, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఆటో డ్రైవర్లకు ఆర్థిక చేయూత అందించడంతో వారు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఆటో డ్రైవర్ల సేవలో పథకం కింద వారి ఖాతాల్లో రూ.15వేలు చొప్పున ప్రభుత్వం శనివారం జమచేసింది. ఈ పథకం కింద జిల్లాలో 15,417 మంది డ్రైవర్లకు రూ.23.21 కోట్లు లబ్ధిచేకూరింది. కష్టకాలంలో ప్రభుత్వం తమను ఆదుకుందంటూ (మిగతా 6వ పేజీలో..)

సీఎంకు కృతజ్ఞతలు



రాష్ట్రం ఆర్థిక సంక్షోభంలో ఉన్నా ముఖ్యమంత్రి చంద్రబాబు ఆటో డ్రైవర్లకు రూ.15వేలు వేయడం సాహసోపేత నిర్ణయం. ఎన్నికల్లో హామీ ఇవ్వకపోయినా డబ్బులు వేయడం సంతోషంగా ఉంది. ఇటువంటి నేత రాష్ట్రానికి అవసరం. సీఎంకు కృతజ్ఞతలు.

-గోకేడ తాతారావు, ఆటో డ్రైవర్, కల్లేపల్లి స్టాండ్, లక్కవరపుకోట

నేడు గ్రీవెన్స్ రద్దు

విజయనగరం కలెక్టరేట్, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): పైడితల్లి అమ్మవారి తొలేళ్ల సంబరం, విజయనగరం ఉత్సవాలు జరుగుతున్న నేపథ్యంలో సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించినున్న పీజీఆర్ఎస్‌ను రద్దు చేస్తున్నట్టు కలెక్టర్ రామసుందర్ రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్జీదారులు ఈవిషయాన్ని గమనించాలని కోరారు.

రేపు రెవెన్యూ ఉద్యోగుల ఆధ్వర్యంలో అన్నదానం

విజయనగరం కలెక్టరేట్, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): విజయనగరం పైడితల్లి పండుగ సందర్భంగా రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం ఉదయం 7 గంటల నుంచి స్థానిక రెవెన్యూ హోం, రైల్వే స్టేషన్‌లో అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేస్తున్నారు. ఈ విషయాన్ని రెవెన్యూ ఉద్యోగులు సంఘం జిల్లా అధ్యక్షుడు తాడ్డి గోవింద ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.

పైడిమాంబకు వెండి బిందెల బహూకరణ

విజయనగరం కల్చరల్, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): పైడిమాంబ సిరిమానోత్సవం సందర్భంగా నగరానికి చెందిన టీడీపీ నాయకుడు అవనాపు విజయ్ ఆదివారం పైడిమాంబకు ఐదు కిలోల నాలుగు వెండి బిందెలను బహూకరించారు. ఆలయ ఈవో కార్యాలయంలో ఆలయ ధర్మకర్తల మండలి సమక్షంలో ఆయన వీటిని అందజేశారు. విజయ్‌తో పాటు ఆయన సతీమణి భార్గవి, మాజీ కౌన్సిలరు, విజయ్ తల్లి అవనాపు చిన్నమ్మలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

చలో విజయవాడను జయప్రదం చేయండి

చీపురుపల్లి, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): ఈనెల 7న జరగనున్న చలో విజయవాడ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఫ్యాప్టో నాయకులు మీసాల అప్పలనాయుడు, ఎ.సత్యశ్రీనివాస్, మామిడి శ్రీను తదితరులు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఆదివారం వారు చీపురుపల్లిలో ఫ్యాప్టో పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో ఫ్యాప్టో నాయకులు డి.రాము, సూరు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ముఖచిత్రంగా సతీ సహగమన శిల


సతీ సహగమన శిల

రాజాం, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): వాసుదేవపట్నం శ్మశానవాటికలో గల సతీ సహగమన శిలను 'రాజాం చరిత్ర సంస్కృతి' అనే గ్రంథానికి ముఖచిత్రంగా అలంకరించే అవకాశం వచ్చిందని ఆ గ్రంథ రచయిత గార రంగనాథం ఆదివారం స్థానిక విలేకర్లకు తెలిపారు. ఈ ప్రాంతాన్ని 700 సంవత్సరాల కిందట జయపురం రాజులు పరిపాలించారని, వారి పాలనలోనే ఇటాంటి సతీసహగమన దురాచారం ఉండేదని ఆయన వివరించారు.

రూ.50వేలు ఆర్థిక సాయం

భోగాపురం, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): తల్లిదండ్రులను పోగొట్టుకుని, పేదరికంతో ఇబ్బంది పడుతున్న రామచంద్రపేటకు చెందిన ఇప్పిలి రాంబాబుకు గ్రామానికి చెందిన జనసైనికులు నొడగల రాము ఆధ్వర్యంలో ఆదివారం రూ.50వేలు సాయం చేశారు. సీహెచ్‌సీ ఆరోగ్య సలహా కమిటీ మెంబరు బొల్లు త్రినాథ్, కోలా గోవింద పాల్గొన్నారు.

పీఏసీఎస్ బలోపేతానికి కృషి చేయండి

జామి, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): జామి పీఏసీఎస్ నూతన కార్యవర్గం సొసైటీ బలపేతానికి కృషి చేయాలని ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి అన్నారు. ఆదివారం జామిలో నూతన సొసైటీ అధ్యక్షుడిగా ఎన్నుకున్న వర్మ, ఇద్దరు డైరెక్టర్లతో ఆమె ప్రమాణ స్వీకారం చేయించారు.

నేడు ఎస్.కోట పీఏసీఎస్ అధ్యక్షుడి ప్రమాణస్వీకారం

ఎస్.కోట రూరల్, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): ఎస్.కోట పీఏసీఎస్ అధ్యక్షుడిగా జీఎస్ నాయుడు ప్రమాణస్వీకారం చేయనున్నారు. ఈ కార్యక్రమం మండలంలోని పోతనాపల్లి గ్రామంలో గల ఒక ప్రైవేటు ఫంక్షన్ హాల్‌లో సోమవారం జరుగనుంది. ఈ కార్యక్రమానికి పెద్దసంఖ్యలో కూటమి నాయకులు, కార్యకర్తలు హాజరు కావాలని పార్టీ నాయకులు కోరారు.

వైసీపీ ట్రేడ్ యూనియన్ అధికార ప్రతినిధిగా దవళ

నెల్లిమర్ల, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): మొయిద విజయరాంపురం గ్రామానికి చెందిన దవళ లక్ష్మణరావును వైసీపీ కార్మిక విభాగం రాష్ట్ర అధికార ప్రతినిధిగా ఆ పార్టీ అధినేత వైఎస్ జగన్మోహన్‌రెడ్డి నియమించారు. ఈ మేరకు పార్టీ అధిష్ఠానం ఆదివారం ఉత్తర్వులు జారీ చేసింది.

యాదవ సంఘం మండల అధ్యక్షుడిగా సురేష్

డెంకాడ, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): యాదవ సంఘం డెంకాడ మండల అధ్యక్షుడిగా ముద్దాడ సురేష్‌యాదవ్‌ను నియమించారు. ఆదివారం విజయనగరం జిల్లా బీసీ సంక్షేమ సంఘం యాదవ యువసేన వ్యవస్థాపక అధ్యక్షుడు గొలగాన రమేష్ యాదవ్ ఆయనకు నియామక పత్రం అందజేశారు. అనంతరం రమేష్ యాదవ్‌ను సన్మానించారు. ఈ కార్యక్రమంలో పలువురు యాదవ కులస్థులు పాల్గొన్నారు.

ఉత్సవ సందడి

● ఘనంగా విజయనగరం ఉత్సవాలు ● ఆకట్టుకున్న సాంస్కృతిక ప్రదర్శనలు


వైద్యావిజ్ఞానిక ప్రదర్శనను ప్రారంభిస్తున్న మంత్రి శ్రీనివాస్, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్, ఎమ్మెల్యే అదితి గజపతిరాజు

విజయనగరం టౌన్, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): విజయనగరం ఉత్సవాలను జిల్లా కేంద్రంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. స్థానిక లయన్స్‌క్లబ్‌లో నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆహుతులను ఆకట్టుకున్నాయి. థింసా నృత్యం, కర్రసాము, పులివేషాలు, డప్పు వాయిద్యం, గిరిజన నృత్యం, జముకులు కథ, రేలారేలా ఫోక్ సాంగ్స్, కోలాటం, తప్పెటగుళ్లు, బుర్రకథ, తూర్పు భాగవతం, డాక్యుమెంటరీ షో వంటి సాంస్కృతిక కార్యక్రమాలు చూపరులను ఆద్యాంతం ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమాలు పీవీ పద్మనాభం, టీపీ భవానీ, బి.ఆశయ్య, పీవీ లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో నిర్వహించారు.

కోట ఆవరణలో విద్యా వైజ్ఞానిక ప్రదర్శన

విజయనగరం కలెక్టరేట్, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): విజయనగరం ఉత్సవాల్లో భాగంగా కోట ఆవరణలో ఏర్పాటుచేసిన విద్యా వైజ్ఞానిక ప్రదర్శనను మంత్రి కొండపల్లి శ్రీనివాస్ ఆదివారం ప్రారంభించారు. అనంతరం స్థానిక ఎమ్మెల్యే అదితి గజపతిరాజు, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావు, ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులు నాయుడు తదితర ప్రముఖులతో కలిసి ఈ విద్య వైజ్ఞానిక ప్రదర్శనను సందర్శించారు. వాటికి సంబంధించి వివరాలను డీఈవో మాణిక్యంనాయుడు వివరించారు.

● ఉత్సవాల్లో భాగంగా స్థానిక కోటలో వీర జవాన్ల చిత్రపటాలతో ఏర్పాటుచేసిన ఫొటో ఎగ్జిబిషన్‌ను మంత్రి కొండపల్లి శ్రీనివాస్, ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, ఎమ్మెల్యే అదితి గజపతిరాజు సందర్శించి, నివాళులర్పించారు.

ఆకట్టుకున్న శ్రీనాథ విజయం

విజయనగరం టౌన్, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): విజయనగరం ఉత్సవాలలో భాగంగా ఎంఆర్ లేడీస్ రిక్రియేషన్ క్లబ్ ఆవరణలో ఉన్న సాహిత్య వేదికపై ఆదివారం నిర్వహించిన సంగీత, సాహిత్య సమరాంగణ శ్రీనాథ విజయం నాటకం, శతాధిక కవి సమ్మేళనం ఆద్యాంతం ఆహుతులను ఆకట్టుకున్నాయి. శ్రీనాథ విజయం నాటకానికి జక్కు రామకృష్ణ, కట్టమూరి చంద్రశేఖర్‌లు అనుసంధాన కర్తలుగా వ్యవహరించారు. అనంతరం కళాకారులను సత్కరించారు. అనంతరం నిర్వహించిన శతాధిక కవి సమ్మేళనం కార్యక్రమానికి చీకటి దివాకర్, సముద్రాల గురుప్రసాద్, సూర్యలక్ష్మి, మానాప్రగడ సాహితి అధ్యక్షత వహించారు. అనంతరం పలువురు కవులను నిర్వాహకులు సత్కరించారు. సంస్కృత కళాశాల ప్రిన్సిపాల్ జీఈ జనార్దన నాయుడు పాల్గొన్నారు.


గంగిరెద్దుల సందడి

ఈపీడీసీఎల్ ఎస్ఈ సందడి

విజయనగరం కల్చరల్, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): విజయనగరం ఉత్సవ ర్యాలీ అనంతరం స్థానిక కోట కూడలి వద్ద నిర్వహించిన వివిధ రకాల ప్రదర్శనలో ఈపీడీసీఎల్ పర్యవేక్షణ ఇంజనీరు మువ్వల లక్ష్మణరావు సందడి చేశారు. మంత్రులు, ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారులు వేదికగా ఏర్పాటైన ఈ కార్యక్రమంలో ఎస్ఈ లక్ష్మణరావు నృత్య ప్రదర్శన ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. విద్యుత్‌శాఖ మహిళా ఉద్యోగులు కొంత మంది ఉత్సవంలో నృత్యాలు చేయగా, ఇంతలో ఎస్ఈ లక్ష్మణరావు వారితో కలిపి నృత్యం చేసి, అందరినీ ఆశ్చర్యపరిచారు.

కళాకారులకు సత్కారం

విజయనగరం ఉత్సవాల్లో భాగంగా స్థానిక మహారాజా సంగీత కళాశాలలో పలు సాంస్కృతిక కార్యక్రమాలు జరిగాయి. ఈ ప్రదర్శనలను ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, ఎమ్మెల్యే అదితి గజపతిరాజు తిలకించారు. ఈసందర్భంగా కళాకారులను ఎంపీ, ఎమ్మెల్యే సత్కరించి.. అభినందించారు. కళాకారులు కూడా ప్రజాప్రతినిధులను సత్కరించారు.


కన్యాశుల్కం నాటకంలో ఓ సన్నివేశం

మహిళలతో కన్యాశుల్కం

విజయనగరం కల్చరల్, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): విజయనగరం ఉత్సవాల్లో భాగంగా కోట ఎదురుగా ఉన్న బొంకుల దిబ్బ వద్ద నిర్వహించిన కన్యాశుల్కం నాటకం ఆకట్టుకుంది. ఈ వేదిక ఇన్‌చార్జిగా గనుల శాఖ ఏడీ సీహెచ్ సూర్యచంద్రరావు వ్యవహరించారు. కేవలం మహిళలతో నిర్వహించిన ఈ నాటకం ఆహుతులను ఆకట్టుకుంది.


క్రీడలతోనే మానసిక ఉల్లాసం


క్రీడాకారుల ప్రదర్శన

విజయనగరం టౌన్, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): క్రీడలతో మానసిక ఉల్లాసం పొందవచ్చని ఎమ్మెల్యే అదితి గజపతి రాజు అన్నారు. ఉత్సవాల్లో భాగంగా విజ్జీ మైదానం లో ఆమె క్రీడలను ప్రారంభించారు. ముందు గా క్రీడాకారులను పరిచ యం చేసుకున్నారు. చెస్‌లో బాలుర విభాగంలో సత్యక్రిష్ గెలుపొంద గా.. బాలికల విభాగంలో సవిత గెలుపొందారు. విజేతలకు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమం లో క్రీడాభివృద్ధి అధికారి శ్రీధర్‌రావు పాల్గొన్నారు.


నృత్యం చేస్తున్న ఈపీడీసీఎల్ ఎస్ఈ లక్ష్మణరావు


మహిళల కోలాటం


కోట గోడపై లేజర్ షో


కోలాటం ఆడుతున్న మంత్రి అనిత, ఎమ్మెల్యే అదితి

మోతీమహల్‌లో ఆడిటోరియం ప్రారంభం


మాట్లాడుతున్న గోవా గవర్నర్ అశోక్ గజపతిరాజు

విజయనగరం రూరల్, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): కోటలోని మోతీమహల్ అభినవ ఆంధ్రభోజ మహారాజా అనందగజపతిరాజు ఆడిటోరియంను మాన్సాస్ విద్యా సంస్థల ఛైర్మన్, గోవా రాష్ట్ర గవర్నర్ అశోక్ గజపతిరాజు ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఆడిటోరియం ఎంతో మంది విద్యార్థులకు వారి నైపుణ్యాలు, వ్యక్తిత్వం వికాసం పెంపొందించడానికి దోహదపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మాన్సాస్ విద్యా సంస్థల కరస్పాండెంట్ డా.కేవీఎల్ రాజు, ఈవో ప్రసాద్, ఎంవీజీఆర్ ఇంజనీరింగు కళాశాల డైరెక్టర్ ప్రొఫెసర్ సీతారామ రాజు, మాన్సాస్ విద్యా సంస్థల ప్రిన్సిపాల్స్ సాంబశివ రావు, పీఎస్ఎన్ రాజు, వైఎంసీ శేఖర్ పాల్గొన్నారు.

రైల్వే వంతెన పనుల్లో జాప్యం వద్దు

రాజాం, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): చీపురుపల్లి రైల్వే వంతెన పనుల్లో జాప్యం చేయవద్దని టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు కిమిడి కళావెంకటరావు అధికారులను ఆదేశించారు. ఆదివారం రాజాంలోని తన క్యాంపు కార్యాలయంలో రైల్వే ఆర్అండ్‌బీ అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వంతెన పనుల్లో జాప్యం కారణంగా ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని చెప్పారు. వంతెన తో పాటు సర్వీసు రోడ్డును కూడా సకాలంలో పూర్తిచేయాలని ఆయన ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆర్అండ్ బీ కార్యానిర్వాహక ఇంజనీరు ఎం.జేమ్స్, డీఈఈ రవి శేఖర్, ఏఈఈ మురళిబాబు, రైల్వే అధికారులు ఏఎక్స్ఎన్ డి.ప్రకాష్‌రావు, ఎస్ఎస్ఈ పీవీ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

పాపారావుకు ఘన సన్మానం


పాపారావును సన్మానిస్తున్న దృశ్యం

రాజాం, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): స్థానిక విద్యానికేతన్ పాఠశాల కరస్పాండెంట్ గట్టి పాపారావును ఆదివారం విజయవాడలో సీతారామ్ ఫంక్షన్ హాలులో ఘనంగా సన్మానించారు. 29 సంవత్సరాలుగా ప్రైవేటు పాఠశాలను నిర్వహించడమే కాకుండా శ్రీకాకుళం, విజయనగరం జిల్లాల్లో ప్రైవేటు పాఠశాలల అధ్యక్షుడిగా ఆయన చేసిన సేవలను గుర్తించి ఈ సన్మానం చేసినట్టు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిల్ ఛైర్మన్ కొమరగిరి చంద్రశేఖర్, రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని సింహాచలం, రాష్ట్ర సలహాదారు, కె.అశోక్ తదితరులు పాల్గొన్నారు.

ఈకేవైసీ తప్పనిసరి

గజపతినగరం, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): గ్రామీణ ఉపాధి హామీ పథకంలో అవినీతికి తావు లేకుండా ప్రతిఒక్కరూ ఈకేవైసీ నమోదు చేసుకోవాలని ఉపాధి హామీ పథకం పీడీ శారదదేవి అన్నారు. ఆదివారం మరుపల్లి గ్రామంలో ఉపాధి హామీ కూలీలకు ఈకేవైసీ వల్ల కలిగే ప్రయోజనాలను ఆమె వివరించారు. జాబ్ కార్డు ఉన్న ప్రతిఒక్కరూ ఈకేవైసీ నమోదు చేసుకోవాలన్నారు. ఏపీవో కృష్ణవేణి, సిబ్బంది పాల్గొన్నారు.

ఇష్టారాజ్యంగా దర్శనానికి అనుమతులు


వీఐపీ గేటు వద్ద జనం

విజయనగరం కల్చరల్, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): తొలేళ్ల ఉత్సవం ప్రారంభం కాకముందే పైడిమాంబ దర్శనానికి పైరవీల పెత్తనం ఎక్కువ అవుతున్నది. ఆలయ ప్రధాన ద్వారం వద్ద ప్రముఖుల దర్శనం కోసం వీఐపీ గేటు ఏర్పాటు చేశారు. ఆదివారం ఈ గేటులో వీఐపీల సంగతి ఎలా ఉన్నా, అనధికారంగా చాలా మంది ఆ గేటు నుంచే వెళ్లారు. అమ్మవారి ఆలయం ఎడమవైపున క్యూ లైను ముందు కూడా ఒక గేటు ఏర్పాటు చేశారు. ఈ గేటులో కూడా చాలా మంది భక్తులను పంపించారు. అలాగే ఆలయం వెనుక భాగం నుంచి కూడా అమ్మవారి దర్శనానికి చాలా మందిని అనుమతించడంతో క్యూలైన్లో భక్తులు గంటల తరబడి ఇబ్బందులు పడాల్సి వచ్చింది.

● దేవదాయ శాఖ సహాయ కమిషనర్, ఇన్‌చార్జి ఆలయ ఈవో కె.శిరీషా ఆదివారం ఈవో కార్యాలయంలో నుంచి అమ్మవారి దర్శనాల క్యూలైన్లను సీసీ ఫుటేజీలో పర్యవేక్షించారు. అనధికారికంగా ఎవరినీ ఆలయం వెనుక గేటు నుంచి, వీఐపీ గేటు నుంచి అనుమతించవద్దని సిబ్బందిని ఆదేశించారు. వెనుక గేటు నుంచి పంపిన వ్యక్తులను పిలిచి మందలించాలని ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని ఆమె ఆలయ అధికారులకు సూచించారు.

చర్చనీయాంశమైన డీసీసీబీ వేదిక

విజయనగరం/ విజయనగరం రూరల్, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): పైడిమాంబ సిరిమాను జాతర నేపథ్యంలో డీసీసీబీ వేదిక విషయం చర్చనీయాంశమైంది. ప్రతి ఏడాది డీసీసీబీ వేదిక నుంచి బొత్స కుటుంబీకులు సిరిమాను తిలకిస్తుండేవారు. ఎందుకంటే బొత్స సిఫారసు చేసిన వ్యక్తులే ఆ బ్యాంకుకు ఛైర్మన్‌గా వ్యవహరిస్తుండేవారు. అయితే ప్రస్తుతం డీసీసీబీ ఛైర్మన్‌గా, జిల్లా పార్లమెంటరీ అధ్యక్షుడిగా కిమిడి నాగార్జున వ్యవహరిస్తుండడంతో సీన్ రివర్స్ అయ్యింది. ఈ ఏడాది డీసీసీబీ వేదిక వద్ద సిరిమాను తిలకించేందుకు పీఏసీఎస్ అధ్యక్షుల విన్నపం మేరకు ఏర్పాట్లు చేయాలని నాగార్జున నిర్ణయించారు. ఈ వేదికపై డీసీసీబీ ఛైర్మన్‌తో పాటు, డీసీఎంఎస్ ఛైర్మన్ గొంపా కృష్ణ, ఉమ్మడి విజయనగరం జిల్లాలో గల పీఏసీఎస్ అధ్యక్షులు, సభ్యులు తిలకించనున్నట్టు చెప్పారు. ఇదిలా ఉండగా.. డీసీసీబీ వేదిక వద్ద సిరిమాను తిలకించేందుకు ఏర్పాట్లు చేయాలని వైసీపీ ఎమ్మెల్సీ బొత్స సత్యనారాయణ అధికారులకు లేఖ రాశారు. ఈ లేఖపై డీసీసీబీ ఛైర్మన్ స్పందించడంతో ఇరు పార్టీల మధ్య డీసీసీబీ వేదిక అంశం రాజకీయ దుమారం లేపింది.

● అయితే అధికార యంత్రాంగం చర్చించి.. ఎమ్మెల్సీ బొత్స కుటుంబీకులు, వైసీపీ నాయకులకు డీసీసీబీ కార్యాలయం వద్దే వేదిక ఏర్పాటు చేయాలని చివరికి నిర్ణయించింది.

ఎమ్మెల్యేకు ఫేకర్ కార్మికుల కృతజ్ఞతలు


ఎమ్మెల్యే కళాకు కృతజ్ఞతలు తెలుపుతున్న కార్మికులు

గరివిడి, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): చీపురుపల్లి ఎమ్మెల్యే కిమిడి కళావెంకటరావుకు ఫేకర్ కార్మికులు ఆదివారం కలిసి తమ కృతజ్ఞతలను తెలిపారు. ఫేకర్ గత కొన్నేళ్లుగా మూతపడి ఉన్న విషయం తెలిసిందే. ఈనేపథ్యంలో ఫేకర్‌లో గత 20 సంవత్సరాలుగా పనిచేస్తున్న 116 మంది కార్మికులు వారికి సరైన పేకేజీ ఇచ్చి సెటిల్‌మెంట్ చేయాలని యాజమాన్యంతో చర్చలు జరిపారు. ఈ చర్చలు జరిపే విధంగా ఎమ్మెల్యే కళావెంకటరావు కృషి చేశారు. వారికి న్యాయం జరిగే విధంగా చర్యలు చేపట్టారు. దీంతో కార్మికులు ఎమ్మెల్యేను కలిసి, కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల నాయకులు పైల బలరాం, సారిపాక సురేష్‌కుమార్, ఎలకల వెంకునాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్ల హర్షం


ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి, ఎమ్మెల్యేల చిత్రపటాలకు పాలభిషేకం చేస్తున్న దృశ్యం

భోగాపురం, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఆటో డ్రైవర్లకు రూ.15వేలు అందజేయడంతో వారు హర్ష వ్యక్తం చేస్తూ ఆదివారం స్థానిక జనసేన పార్టీ కార్యాలయ ఆవరణలో ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, ఎమ్మెల్యే లోకం నాగమాధవి చిత్రపటాలకు పాలభిషేకం చేశారు. జనసేన క్లస్టర్ ఇన్‌చార్జి పల్లంట్ల జగదీష్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో నాయకులు పల్ల రాంబాబు, గుండపు సూర్యారావు, బొడ్డ హరిబాబు, పడాల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే కోండ్రు చిత్రపటానికి పాలభిషేకం


ఎమ్మెల్యే కోండ్రు చిత్రపటానికి పాలభిషేకం చేస్తున్న డోలపేట గ్రామస్థులు

రాజాం, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): గత కొన్ని దశాబ్దాలుగా పరిష్కారం కాని డోలపేట భూహక్కుల సమస్యపై ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్ అసెంబ్లీ సమావేశంలో ప్రస్తావించడంతో ఆయన చిత్రపటానికి ఆ గ్రామస్థులు పాలభిషేకం చేశారు. ఆదివారం డోలపేట గ్రామంలో సర్దార్ తాండ్ర పాపారాయ భూహక్కుల పరిరక్షణ సంఘం ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. సంఘ నాయకులు గేదెల రవి, డోల చంద్రినాయుడు, రవీంద్ర, ఆదినారాయణ పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక


కలుసుకున్న పూర్వ విద్యార్థులు

రాజాం, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 2002లో పదో తరగతి చదువుకున్న విద్యార్థులు ఆదివారం ఆత్మీయంగా అదే పాఠశాల వద్ద కలుసుకున్నారు. ఆనాటి ఉపాధ్యాయులను ఆహ్వానించి సన్మానించారు. ఆనాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు ఎస్.వాసు, వి.అప్పలనాయుడు, కె.శ్రీను, కె.గణేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆటోపై చెట్టు కొమ్మ పడి ముగ్గురికి గాయాలు

కొత్తవలస, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): ఆటోపై చెట్టు కొమ్మ విరిగి పడిన ఘటనలో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన ఆదివారం సాయంత్రం తుమ్మికాపల్లిలోని అగ్నిమాపక కేంద్రం సమీపంలో చోటుచేసుకుంది. విశాఖపట్టణం నుంచి ఎస్.కోట వైపు ఓ ఆటో ప్రయాణికులతో వెళ్తోంది. తుమ్మికాపల్లి అగ్నిమాపక కేంద్రం సమీపంలోకి వచ్చేసరికి, చెట్టు కొమ్మ విరిగి ఆటోపై పడింది. ఎస్.కోట మండలం వెంకటరమణపేటకు చెందిన డ్రైవర్ ఎర్రినాయుడుతో సహా ఆటోలో ప్రయాణిస్తున్న ఎస్.కోటకు చెందిన కోలా సన్యాసయ్య, వెంకట లక్ష్మిలకు తీవ్ర గాయాలయ్యాయి. దీంతో వీరిని ఎస్.కోట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ ప్రమాదంలో ఆటో పూర్తిగా ధ్వంసమైంది.

దుర్గమ్మ ఊరేగింపులో ఘర్షణ

● పోలీసులు చెదరగొట్టే క్రమంలో పలువురికి గాయాలు

గుర్ల, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): జమ్ము గ్రామంలో శనివారం అర్ధరాత్రి జరిగిన దేవీ ఊరేగింపు ఉత్సవంలో ఘర్షణ చోటుచేసుకుంది. టీడీపీ, వైసీపీ వర్గీయులకు సంబంధించిన దేవీ బొమ్మలు ఒకేరోజు నిమజ్జనం చేసేందుకు ఊరేగింపు నిర్వహించారు. దీంతో ఒకే రూట్‌లో వెళ్లే క్రమంలో ఇరువర్గాల మధ్య ఘర్షణ చోటుచేసుకుంది. ఈ కారణంగా సుమారు రాత్రి 10 గంటల వరకు ఎవరూ ముందుకు కదలలేదు. దీంతో చీపురుపల్లి సీఐ శంకరరావు తన సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకున్నారు. ఇరు వర్గాలకు నచ్చజెప్పారు. కానీ ఎవరూ ముందుకు కదలలేదు. పోలీసులు అసహనంతో జనాలను చెదరగొట్టారు. ఈక్రమంలో కొంతమందికి చిన్న చిన్న గాయాలయ్యాయి. సారంపాటి ఆనందరావుకు కొద్దిపాటి దెబ్బలు తగలడంతో స్పృహ తప్పి పడిపోయాడు. వెంటనే అతనిని అక్కడి నుంచి విజయనగరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

బాలిక అదృశ్యం

భోగాపురం, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): భోగాపురం పంచాయతీ కొల్లిపేటకు చెందిన ఓ బాలిక అదృశ్యమైనట్లు ఎస్ఐ పి.సూర్యకుమారి ఆదివారం తెలిపారు. బాలిక విశాఖ జిల్లా తగరపువలసలోని ఓ ప్రైవేటు కళాశాలలో ఇంటర్మీడియట్ చదువుతోంది. ఎప్పటిలాగే శనివారం రాత్రి తల్లిదండ్రులతో కలిసి ఇంట్లో నిద్రపోయింది. అదేరోజు రాత్రి సుమారు 10.30 గంటల సమయంలో తల్లి దండ్రులకు మెలుకువ రావడంతో కుమార్తె ఇంట్లో లేనట్లు గుర్తించారు. రాత్రి సమయంలో చుట్టుపక్కల గాలించినా ఫలితం లేకపోయింది. దీంతో బాలిక తండ్రి స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేశారు.

భక్తులతో సంయమనం పాటించండి


విజయనగరం క్రైం, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): విజయనగరం ఉత్సవాలు, అమ్మవారి సిరిమాను జాతరకు విచ్చేసిన భక్తులతో పోలీసు అధికారులు, సిబ్బంది సంయమనం పాటించాలని ఎస్పీ ఏఆర్ దామోదర్ చెప్పారు. ప్రతిఒక్కరూ వారి, వారి విధులను బాధ్యతతో సమర్థవంతంగా నిర్వర్తించాలని ఆదేశించారు. ఆదివారం పోలీసు పరేడ్ గ్రౌండ్‌లో సమావేశం నిర్వహించి, పలు సూచనలు చేశారు. పండుగను తిలకించేందుకు వివిధ రాష్ట్రాలు, జిల్లా నుంచి భక్తులు అధిక సంఖ్యలో వస్తారని అందరితో మర్యాదగా వ్యవహరించి వివాదాలు లేకుండా చూడాలన్నారు. ఎక్కడైనా ఇబ్బంది తలెత్తితే, ఇన్‌చార్జి అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో అదనపు ఎస్పీ పి.సౌమ్యలత, ఏఆర్ అదనపు ఎస్పీ జి.నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సైక్లింగ్‌తో ఆరోగ్యం


సైక్లింగ్ చేస్తున్న కమాండెంట్ పద్మనాభరాజు

డెంకాడ, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): స్థానిక ఐదో బెటాలియన్‌లో 'ఫిట్ ఇండియా'లో భాగంగా కమాండెంట్ సీహెచ్ వీఎస్ పద్మనాభరాజు ఆధ్వర్యంలో 'సండేస్ ఆన్ సైకిల్ కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కమాండెంట్ మాట్లాడుతూ సైక్లింగ్‌తో ఆరోగ్యాన్ని కాపాడుకోవడమే కాకుండా పర్యావరణ పరిరక్షణకు కూడా తోడ్పతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జ్ అడిషనల్ కమాండెంట్ జీవీ ప్రభాకరరావు, అసిస్టెంట్ కమాండెంట్ ఎస్.బాపూజీ, డీవీ రమణమూర్తి, ఎం.గోపాలకృష్ణ, యూనిట్ ఆర్ఆర్ఐలు, ఆర్ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

మా పోరాటం ఎవరికీ పట్టడం లేదు


బొడ్డవరలో రిలే దీక్ష చేస్తున్న జిందాల్ నిర్వాసితులు

ఎస్.కోట రూరల్, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): జిందాల్ కంపెనీ తమను మోసం చేసిందని బొడ్డవర గ్రామంలో గిరిజన, హరిజన, మైనార్టీలు శాంతియుతంగా పోరాటం చేస్తుంటే ఎవరికీ పట్టడం లేదని వారు మండిపడుతున్నారు. ఆదివారం బొడ్డవర గ్రామంలో 108వ రోజు రిలే నిరాహార దీక్షలో వారంతా పాల్గొన్నారు. ఎవరు ఎన్ని బెదిరింపులకు ప్రయత్నించినా న్యాయం జరిగే వరకు తమ పోరాటం ఆగదన్నారు. కార్యక్రమంలో ఏపీ రైతు సంఘం ఉపాధ్యక్షుడు చల్లా జగన్ ఉన్నారు.

నేడే తొలేళ్ల సంబరం

(3వ పేజీ తరువాయి)

భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా జిల్లా అధికారులు చర్యలు చేపడుతున్నారు. అమ్మవారి ఆలయానికి ఇరువైపులా ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు చేశారు. 2,600 మంది పోలీసులతో బందో బస్తు నిర్వహించనున్నారు. 124 ప్రాంతాల్లో సీసీ కెమెరాలు, 10 డ్రోన్ కెమెరాలు ఏర్పాటు చేశారు. పోలీసు సిబ్బందికి బాడీఓన్ కెమెరాలు అందించారు. మరికొంత మందిని మఫ్టీలో నియమించారు. సిరిమాను తిరిగే ప్రాంతంలో రోడ్డుకి ఇరువైపులా బారికేడ్లు ఏర్పాటు చేశారు. పలు కూడళ్ల వద్ద మూడెంచెల భద్రత కోసం ఇనుప కంచెలు పెట్టారు. తొలేళ్ల ఉత్సవంలో నేల వేషాలు, ముఖ్యంగా పులివేషాలు సందడి చేయనున్నాయి.

ఉత్సవ శోభ

(3వ పేజీ తరువాయి)

కలశాలు, రోలర్ స్కేటర్స్, తప్పెటగుళ్లు, థింసా నృత్యాలు, కోలాటం, కేరళ వాయిద్యాలు, కర్రసాము, కత్తిసాము, అడుగుల బొమ్మలు, కొమ్ము, కోయ, బిందెల, గరగల డ్యాన్స్‌లు, చెక్క భజనలు, గంగిరెద్దులు, ఖాళీమాతా నృత్యాలు, ఒంటెల ప్రదర్శనలు ఆహూతులను ఆకట్టుకున్నాయి. మహిళలతో కలిసి మంత్రి అనిత, ఎమ్మెల్యే అదితి గజపతిరాజు థింసా నృత్యం చేస్తూ సందడి చేశారు. చిన్నారుల యుద్ధ విన్యాసాలు అందరినీ ఆశ్చర్యపరిచాయి. గతంలో ఎన్నడూ లేని విధంగా ఈ ఏడాది ఉత్సవాలు ప్రజల్లో మరింత ఉత్సాహం, ఉత్తేజాన్ని నింపాయి, పిల్లల నుంచి పెద్దల వరకూ వందలాది సంఖ్యలో ఉత్సవాలు తిలకించారు. ముఖ్యంగా విజయనగరం వైభవాన్ని చాటిచెప్పే పలు కార్యక్రమాలు, పైడిమాంబ అమ్మవారి కలశాల ప్రదర్శనతో భక్తుల్లో ఆధ్యాత్మికత సంతరించుకుంది. కార్యక్రమంలో ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, గాజువాక ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులనాయుడు, రాష్ట్ర మార్క్‌ఫెడ్ చైర్మన్ కర్రోతు బంగార్రాజు, డీసీసీబీ చైర్మన్ నాగార్జున, కలెక్టర్ ఎస్.రామసుందరరెడ్డి, ఎస్పీ ఏఆర్ దామోదర్, జేసీ సేతుమాధవన్ తదితరులు పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్ల ఆనందం

(3వ పేజీ తరువాయి)

డ్రైవర్లు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఈ నగదును ఆటోకి బీమా, టైర్లు, ఫిట్‌నెస్ తదితర వాహన నిర్వహణ కోసం ఉపయోగిస్తామని వారు చెబుతున్నారు.

ఆటో నిర్వహణకు వెచ్చిస్తా



ఆటో డ్రైవర్ సేవలో పథకం కింద ఈ రోజు నా ఖాతాలో రూ.15 వే లు జమయ్యాయి. ఈ డబ్బును ఆటో నిర్వహణ ఖర్చుల కోసం ఉపయోగించుకుంటాను. ఆర్థికంగా ఆదుకున్న ముఖ్యమంత్రి చంద్రబాబుకు ధన్య వాదాలు.

-మరిశర్ల శ్రీనివాసరావు, కలవరాయి, బొబ్బిలి

ఫైనాన్స్‌కు జమ చేస్తా



ఇదివరకూ నేను రోజుకి రూ.1500 వరకూ సంపాదించేవాడిని. మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించడంతో మాకు తీరని కష్టాలు ఎదురయ్యాయి. రోజుకి కనీసం రూ.500 కూడా సంపాదించలేక పోతున్నాం. ముఖ్యమంత్రి మా ఆటో డ్రైవర్లందరికీ దేవుడిలా ఈ ఆటో డ్రైవర్ సేవలో పథకం ప్రవేశపెట్టడం చాలా ఆనందంగా ఉంది. ఈ డబ్బుని ఆటో ఫైనాన్స్‌కి కొంత జమ చేస్తాను. మిగతాది ఆటో నిర్వహణ ఖర్చులకు ఉపయోగిస్తాను.

-గలావిల్లి అప్పారావు, జగన్నాథపురం, బొబ్బిలి

ఆనందంగా ఉంది



మహిళలకు ఉచిత బస్సు పథకం వల్ల ఆటోలకు బేరాలు తగ్గాయి. అయినా కుటుంబ పోషణ కోసం ఆటో నడుతున్నా. రోడ్డుపై వాహనం నడపాలంటే అన్ని పత్రాలు ఉండాలి. లేదంటే పోలీసులు కేసులు నమో దు చేస్తారు. ఇన్సూరెన్స్, ఫిట్‌నెస్ చేయించేందుకు అప్పు చేద్దామను కున్నా. ఈ సమయంలో నగదు జమచేయడం ఆనందంగా ఉంది.

-కోరాడ రాము, ఆటోడ్రైవర్, కొంగవానిపాలెం, భోగాపురం

విపత్తుల సమాచారం తెలుసుకునేదెలా?

(3వ పేజీ తరువాయి)



నిరుపయోగంగా జనరేటర్

మండలాల్లో సుమారు 16 గ్రామాలు ఉన్నాయి. బంగాళాఖాతంలో పదేపదే అల్పపీడనాలు, వాయుగుండాలు, తుఫాన్లు ఏర్పడుతుంటాయి. పదేళ్ల కిందట హుద్‌హుద్ తుఫాన్ ఎంత విధ్వంసం సృష్టించిందో అం దరికీ తెలిసిందే. ప్రాణ నష్టంతో పాటు ఆస్తినష్టం భారీగా జరిగింది. తుఫాన్లు, వాతావరణంలో మార్పులు తదితర విషయాలను సాంకేతి కంగా ముందస్తుగానే తెలుసుకునేందుకు విపత్తుల శాఖ 2018-2019లో భోగాపురం తహసీల్దార్ కార్యాలయంలోని ఓ గదిలో కంట్రోల్ రూమ్‌ను సిద్ధం చేసింది. ఇందుకు అవసరమైన పరికరాలు, జనరేటర్, టవర్‌ను రూ.లక్షలు వెచ్చించి కొనుగోలు చేసింది. అప్పట్లో కంట్రోల్ రూమ్‌ను సిద్ధం చేశారేగానీ నిర్వహణను గాలికి వదిలేశారు. దీంతో విలువైన పరికరాలు మూలకు చేరాయి. అధికారులు ఎవరూ పట్టించుకోక పోవడంపై ప్రజలు ఆవేదన చెందుతున్నారు. ప్రభుత్వ సొమ్ము వృథా చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా వినియోగంలోకి తీసుకురావాలని కోరుతున్నారు. దీనిపై తహసీల్దార్ ఎం.రమణమ్మను వివరణ కోరగా.. విపత్తుల పరికరాలకు సంబంధించి తమవద్ద ఎటువంటి సమాచారం లేదని తెలిపారు.

అధ్వాన రహదారులతో అవస్థలు



కోటశిర్లాం నుంచి ఎనుబరువు రోడ్డు దుస్థితి

రామభద్రపురం, అక్టోబరు5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గ్రామీణ రహదారులు అధ్వానంగా ఉన్నాయి. 22 పంచాయతీల్లో చాలా గ్రామాలకు పక్కా రోడ్లు లేవు. దీంతో ప్రజల అవస్థలు వర్ణనాతీతం. కోటశిర్లాం నుంచి ఎనుబరువు వెళ్లే రోడ్డు యావత్తూ గోతులమయంగా ఉంది. రాత్రివేళల్లో రాకపోకలకు వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. కారేడువలస, కాకర్లవలస గ్రామాల ప్రజలకు ఇప్పటికీ బీటీ రోడ్డు సౌకర్యం లేకపోవడంతో గిరిజనులకు అవస్థలు తప్పడంలేదు. కొండకెంగువ నుంచి గిరిజన పల్లెలకు వెళ్లే రహదారులు రూపుకోల్పోయాయి. మండలంలోని ఏకైక గిరిజన పంచాయతీ రావివలస చుట్టుపక్కల గ్రామాలకు సరైన రహదారి లేకపోవడంతో గిరిజనులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గిరిజన ప్రాంతాల్లోని ఉత్పత్తులను మైదాన ప్రాంతాలకు తరలించేందుకు వారు నరకయాతన పడుతున్నారు. ఈ రోడ్డుకు నిధులు మంజూరు చేసినప్పటికీ కాంట్రాక్టర్ పనులు చేపట్టలేదు. ఆరికతోట పంచాయతీ పరిధిలోని బీసీ కాలనీ నుంచి ఊరిలోకి వెళ్లే రహదారి పూర్తిగా బురదమయంగా ఉంది. దీంతో స్థానికులు ఇబ్బంది పడుతున్నారు. ఇప్పటికైనా పాలకులు స్పందించి గ్రామీణ రహదారుల అభివృద్ధికి చర్యలు చేపట్టాల్సి ఉంది.

ఉపాధ్యాయులకు సమాజంలో సముచిత స్థానం



విశ్రాంత ఉపాధ్యాయులతో ఎమ్మెల్యే బేబీనాయన

బొబ్బిలి, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి):ఉపాధ్యాయులకు సమాజంలో ఎప్పుడూ సముచిత స్థానం ఉంటుందని ఎమ్మెల్యే బేబీనాయన అన్నారు. ప్రపంచ ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం బొబ్బిలి కోటలోని దర్బార్‌మహల్‌లో నియోజకవర్గం పరిధిలోని విశ్రాంత ఉపాధ్యాయులను ఆయన ఘనంగా సత్కరించారు. విశ్రాంత ఉద్యోగుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు, రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ డైరెక్టర్ రౌతు రామ్మూర్తి అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా విశ్రాంత ఉపాధ్యాయులను ఆయన సత్కరించి జ్ఞాపికలను అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ మానవ సంబంధాలను మరింతగా బలోపేతం చేయాలన్న సంకల్పంతో ఏటా విశ్రాంత ఉపాధ్యాయులందరినీ గౌరవిస్తున్నామన్నారు. తల్లి, తండ్రి తర్వాత గురువుకు ఎంతో ప్రాధాన్యం ఉందని గుర్తుచేశారు. వారి ప్రోత్సాహం, ఆశీస్సులు ప్రతీ పౌరుడిని ముందుకు నడిపిస్తూ సమాజంలో పేరు ప్రఖ్యాతులు దక్కేలా చేస్తాయన్నారు. విశ్రాంత ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి అల్లాడ భాస్కరరావు, మండల పార్టీ అధ్యక్షుడు వాసిరెడ్డి సత్యనారాయణ, విశ్రాంత ఉద్యోగుల సంఘం నాయకులు కర్రి సత్యనారాయణ, లచ్చుపతుల జగన్నాథం, రెడ్డి కృష్ణమూర్తి, చల్ల లక్ష్మణరావు, తెంటు చిరంజీవిరావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా నిమజ్జనోత్సవం



అమ్మవారి ఊరేగింపు.. యువకుల సందడి

బొబ్బిలి, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రావువారి వీధిలో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఏర్పాటు చేసిన రాజరాజేశ్వరి అమ్మవారి విగ్రహానికి శనివారం రాత్రి ఘనంగా నిమజ్జనోత్సవాన్ని నిర్వహించారు. గురుస్వాములు కర్రోతు రాములప్పన్న, బొత్స అప్పలు ఆధ్వర్యంలో భవానీ మాలాధారులు భక్తిశ్రద్ధలతో కార్యక్రమాన్ని చేపట్టారు. తొలుత మేళతాళాలతో అమ్మవారిని ఊరేగించారు. పెద్దఎత్తున బాణసంచా కాల్చారు. బళ్ల వేషాలు, కోలాటం, ఇతర వేషధారణలు అందరినీ ఆకట్టుకున్నాయి. అనంతరం స్థానిక కోట చెరువులో అమ్మవారిని నిమజ్జనం చేశారు.

విద్యారంగంలో సంస్కరణలు అవసరం



రౌతు రామ్మూర్తి

బొబ్బిలి, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): ఎన్నో సవాళ్లను ఎదుర్కొంటున్న విద్యారంగంలో అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన అవగాహన, సంస్కరణలు చాలా అవసరమని రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ డైరెక్టర్, రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం నేత రౌతు రామ్మూర్తి అన్నారు. ఆదివారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) ప్రభావంతో విద్యారంగం రూపురేఖలు మారిపోతున్న తరుణంలో ఉపాధ్యాయులందరికీ నవీన సాంకేతికతలపై శిక్షణ ఇవ్వాల్సి ఉందన్నారు. జాతీయ విద్యా విధానంలో పొందుపరిచిన విధంగా విద్యారంగానికి జీడీపీలో 6 శాతం నిధులను కేటాయించాలన్నారు. పవిత్రమైన ఉపాధ్యాయ వృత్తిలోకి అపర కీచకులు ప్రవేశించకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలన్నారు. చిన్నారులను మెరికల్లా తీర్చిదిద్దేందుకు అవసరమైన నైపుణ్యం కలిగిన వారికి గౌరవప్రదమైన వాతావరణం కల్పించాలని కోరారు. ఈ అంశాలను విద్యామంత్రి నారా లోకేశ్ దృష్టి త్వరలో తీసుకెళుతున్నట్టు ఆయన తెలిపారు.

స్వచ్ఛ పాఠశాలగా 'రంగరాయపురం'



రంగరాయపురం ప్రాథమికోన్నత పాఠశాల ఇదే..

బొబ్బిలి రూరల్, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): రంగరాయపురం ప్రాథమికోన్నత పాఠశాల జిల్లా స్థాయిలో స్వచ్ఛ పాఠశాలగా ఎంపికైందని ఆ పాఠశాల హెచ్‌ఎం కె.శివ కుమార్ తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రంగరాయపురం పాఠశాలలో పెద్దఎత్తున మొక్కలు నాటి వాటిని సంరక్షిస్తున్నామన్నారు. ప్రతీ మూడో శనివారం స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమాన్ని పక్కాగా నిర్వహిస్తున్నామన్నారు. పాఠశాల ప్రాంగణాన్ని పరిశుభ్రంగా ఉంచుతున్నామన్నారు. విద్యార్థులకు ఆర్వో ప్లాంట్ ద్వారా శుద్ధ జలం అందిస్తున్నామని వివరించారు. ఇందుకుగానూ రంగరాయపురం పాఠశాల జిల్లా స్థాయి లో స్వచ్ఛ పాఠశాలగా ఎంపికైందని హెచ్‌ఎం వివరించారు.

దాడులపై పోరాట ఘనత ఆర్‌ఎస్‌ఎస్‌దే

బొబ్బిలి, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): హిందూ సమాజంపై దాడులకు వ్యతిరేకంగా పోరాడిన ఘనత ఆర్‌ఎస్‌ఎస్‌దేనని జిల్లా కార్యవహ్ రాజశేఖర్ అన్నారు. రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ శతాబ్ది ఉత్సవాలలో భాగంగా ఆదివారం స్థానిక లోకబంధు రెసిడెన్సీలో వ్యాపారవేత్త గ్రంధి ముత్యాలు అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాజశేఖర్ మాట్లాడుతూ ఆర్‌ఎస్‌ఎస్‌ను 1925లో నాగపూర్ లో విజయదశమి రోజున డాక్టర్ కేశవరావ్ బలిరావ్ హెగ్డేవార్ ప్రారంభించారన్నారు. అప్పట్లో సమాజంలో పెచ్చుమీరిన దేశ వ్యతిరేక శక్తులను ఎదుర్కోవాలని యువతకు పిలుపునిచ్చారన్నారు. హిందూ సమాజంపై జరిగే దాడులపై పోరాడే విధంగా అందరినీ సమాయత్తపరిచారన్నారు. అదే స్ఫూర్తితో దేశంలోని అనేక రాష్ట్రాలలో అనతికాలంలో ఆర్‌ఎస్‌ఎస్ శాఖలు విస్తరించాయన్నారు. ప్రస్తుతం ప్రపంచ వ్యాప్తంగా లక్షలాది మంది స్వయం సేవక్‌లు భరతమాత సేవలో తరిస్తున్నారని వివరించారు. అనంతరం ఆర్‌ఎస్‌ఎస్ విభాగ్ కార్యకారి కె.వి.రమణ మాట్లాడారు. తొలుత భరతమాత చిత్రపటానికి పూలమాల అలంకరణ చేశారు. సమావేశంలో పెంట స్వామినాయుడు, పుల్లెల శ్రీనివాసరావు, 200 మంది స్వయం సేవ కులు పాల్గొన్నారు.

'బొంతలకోటి'కి అభినందనలు

బొబ్బిలి, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి):కోమటిపల్లి గ్రామానికి చెందిన తూర్పు భాగవతం కళాకారుడు బొంతలకోటి శంకరరావును ఎమ్మెల్యే బేబీనాయన అభినందించారు. అంతరించిపోతున్న ప్రాచీన సంప్రదాయ కళలను పోషిస్తూ, ఆ కళను భావితరాలకు అందిస్తున్నందుకు శంకరరావు సేవలను కొనియాడారు. దేశంలోని పలు కళాసంస్థలు గుర్తించి అవార్డులు ఇస్తున్న నేపథ్యంలో ఆయనను ఆదివారం బొబ్బిలి కోటలో ఎమ్మెల్యే బేబీనాయన ఘనంగా సత్కరించారు. తమ పూర్వీకుల నుంచి వారసత్వంగా వచ్చిన తూర్పు భాగవతం కళను పోషిస్తూ గుర్తింపు పొందుతున్న శంకరరావు మన ప్రాంతానికి చెందిన వారు కావడం అభినందనీయమని ఎమ్మెల్యే అన్నారు. కార్యక్రమంలో కోమటిపల్లి గ్రామపెద్దలు పాల్గొన్నారు.

కారు ఢీకొని లారీ డ్రైవర్‌కు గాయాలు

రామభద్రపురం, అక్టోబరు5 (ఆంధ్రజ్యోతి): ముచ్చెర్లవలస సమీపంలో ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో లారీ డ్రైవర్ గాయపడ్డాడు. కారు ఢీకొనడంతో ప్రమాదం జరిగింది. ఇందుకు సంబంధించి పోలీసులు అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. శ్రీకాకుళం జిల్లా కేంద్రానికి చెందిన లారీ డ్రైవర్ గేదెల వెంకటరావు విజయనగరం నుంచి రామభద్రపురం వెళ్తున్నారు. ముచ్చెర్లవలస సమీపంలో కాలకృత్యాలు తీర్చుకునేందుకు లారీ దిగారు. అదే సమయంలో రామభద్రపురం నుంచి విజయనగరం వెళ్తున్న కారు అతడిని ఢీకొంది. దీంతో వెంకటరావు గాయ పడ్డారు. ఈ ఘటన జరిగిన అనంతరం కారును వదిలేసి డ్రైవర్ పరారయ్యాడు. దీనిపై రామభద్రపురం ఎస్‌ఐ వెలమల ప్రసాదరావు కేసు నమోదు చేశారు.

నేడు సొంత ఆదాయ వనరులపై శిక్షణ

బొబ్బిలి రూరల్, అక్టోబరు5 (ఆంధ్రజ్యోతి): స్థానిక మండల పరిషత్ సమావేశ భవనంలో నేడు సోమవారం సొంత ఆదాయ వనరులు (ఓన్ సోర్స్ రెవెన్యూ)పై సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులకు సోమ, మంగళవారాల్లో శిక్షణ ఇవ్వనున్నట్టు ఎంపీడీవో రవికుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. పంచాయతీకి సొంత ఆదాయం, స్థానిక పన్నులు, సేవా చార్జీలు, అద్దెలు ఇతర ఆర్థిక కార్యకలాపాలపై శిక్షణ ఇవ్వనున్నామని ఆయన పేర్కొన్నారు.

ఉత్తమ ప్రదర్శనగా 'నేను ఒక నటుడిని' ఎంపిక



ప్రశంసాపత్రం అందుకుంటున్న విజయ మోహనరావు

బొబ్బిలి, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): విజయనగర ఉత్సవాల్లో పట్టణానికి చెందిన ఆనందో బ్రహ్మ అకాడమీ తరఫున ప్రదర్శించిన 'నేను ఒక నటుడిని' ఏక పాత్రాభినయం ఉత్తమ ప్రదర్శన గా ఎంపికైంది. ఉత్సవాలలో భాగంగా ఆదివారం గురజాడ కళాభారతిలో నిర్వహిస్తున్న కళా ప్రదర్శనల్లో మింది విజయ మోహనరావు ఏక పాత్రాభినయం ప్రత్యేక గుర్తింపు పొందింది. ప్రస్తుత సమాజంలో కళాకారుల మానసిక స్థితిగతులకు సంబంధించిన అంశాలు అందరినీ ఆలోచింపజేశాయి. ఈ ఉత్తమ ప్రదర్శనకు గాను జిల్లా అధికారులు జ్ఞాపిక, ప్రశంసాపత్రం, రూ2వేలు నగదు పారితోషకాన్ని అందజేశారు. ఈ సందర్భంగా విజయమోహనరావును బొబ్బిలికి చెందిన పలు కళాసంస్థల ప్రతినిధులు అభినందించారు.

ఏజెన్సీలో పర్యాటక సందడి

సీతంపేట రూరల్, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): సీతంపేట మన్యంలోని ఆడలీ వ్యూ పాయింట్, మెట్టుగూడ జలపాతం, ఎన్టీఆర్ అడ్వెంచర్ పార్క్‌లో ఆదివారం పర్యాటకుల సందడి నెలకొంది. పార్క్‌లోని 5డి థియేటర్, షూటింగ్, స్కై సైక్లింగ్, బోటింగ్ క్రీడల్లో పాల్గొన్నారు.

పార్కులతో ఆరోగ్య వాతావరణం

తెర్లాం, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): పచ్చని పార్కులు, కాలుష్యం లేని కోనేటి జలాలు గ్రామాలకు ఆరోగ్య వాతావరణాన్ని అందిస్తాయని ఎమ్మెల్యే బేబీనాయన అన్నారు. నెమలాంలోని యువకులు కలిసి కట్టుగా గ్రామంలోని కోనేరును సుందరంగా తీర్చిదిద్దారు. దానికి మన కోనేరు అని పేరు పెట్టారు. ఈనేపథ్యంలో ఆదివారం కోనేరును ఎమ్మెల్యే బేబీనాయన, బుడా చైర్మన్ తెంటు లక్ష్మునాయుడు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ యువకులు తలచుకుంటే సాధించలేనిది ఏమీ లేదన్నారు. యువకుల స్ఫూర్తి అభినందనీయమన్నారు. బుడా చైర్మన్ తెంటు మాట్లా డు తూ సహజ వనరులను బాధ్యతతో సంరక్షించుకోవాల్సిన అవసరం అందరి పై ఉందన్నారు. కార్యక్రమంలో బొబ్బిలి ఏఎంసీ చైర్మన్ నర్సుపల్లి వెంకట నాయుడు, ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి తేజోవతి, టీడీపీ నాయకులు నర్సుపల్లి వెంకటేశ్, మర్రాపు యుగంధర్, ఉమామహేశ్వరరావు, ఆనంద్, వెంకట నాయుడు తదితరులు పాల్గొన్నారు.

మూలకు చేరిన ఫాగింగ్ యంత్రాలు



చిత్రకోట బొడ్డవలసలో ఇలా..

బొబ్బిలి రూరల్, అక్టోబరు5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వివిధ పంచాయతీలకు ప్రభుత్వం సమకూర్చిన ఫాగింగ్ యంత్రాలు మూలకు చేరాయి. వాటి నిర్వహణను పట్టించుకునే నాథులే కరువయ్యారు. ప్రధానంగా దోమలు నివారణకు రూ.వేలు వెచ్చించి కొనుగోలు చేసిన యంత్రాలు మూణ్నాళ్ల ముచ్చటగానే మారాయి. చిత్రకోట బొడ్డవలస, చింతాడ, దిబ్బగుడ్డివలస, రంగరాయపురం తదితర గ్రామాల్లో యంత్రాలు పనిచేయడం లేదు. దోమల బెడద అధికంగా ఉన్నా ఫాగింగ్ యంత్రాలను వినియోగంలోకి తతేవాలనే ఆలోచన పంచాయతీ పాలకులు చేపట్టడంలేదు. ● ఇదే విషయమై ఎంపీడీవో రవికుమార్ వివరణ కోరగా, ఫాగింగ్ యంత్రాలను పరిశీలించి పాడైన యంత్రాల మరమ్మతులకు చర్యలు చేపడతామని తెలిపారు.